# పంట సాగు పద్ధతులపై అవగాహన



పంటపొలాల్లో క్షేత్రస్థాయిలో పరిశీస్తున్న ఏరువాక కేంద్ర కో అర్డినేటర్ డాక్టర్ లక్ష్మణ్

ధారూరు, ఫిబ్రవరి 6: వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించిన సాగు విధానాలను పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడిని సాధించవచ్చని ఏరువాక కేంద్ర కో అర్డినేటర్ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. గురువారం ధారూరు వ్యవసాయ శాఖ కళాశాలలో నాలుగో సంవత్సరం చదవుతున్న విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నాగారం, దోర్నాల్ గ్రామాల్లో రైతుల పంటపొలాలను సందర్శించి పంట సంరక్షణపై అవగాహన కల్పించారు. వరి పంటలో మొగ్గి పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగుల నివారణ పద్ధతుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సాంకేతిక పద్ధతులను పాటించడం ద్వారా రైతులు మంచి దిగుబడిని పొందవచ్చని తెలి పారు.

## ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేత



కులకచర్ల, ఫిబ్రవరి 6 :మండల పరిధిలోని పీరంపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు అలవేలు ఆద్వర్యంలో గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసిన విద్యార్థులకు ఫీల్డ్అసిస్టెంట్ జంబు వెంకటయ్య తనవంతు సాయంగా ఉచితంగా స్టడీమెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పార్వతి, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌రహిత సమాజానికి కృషి చేయాలి



పీఏసీఎస్‌లో చైర్మన్‌కు ఇసుకతో తయారు చేసిన ఆయన చిత్రపటాన్ని అందజేస్తున్న జీవమిత్ర ఆర్గనేజేషన్ నిర్వాహకులు

కులకచర్ల, ఫిబ్రవరి 6 : ప్లాస్లిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో జీవమిత్ర ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్‌కు ఇసుకతో తయారు చేసిన ఆయన చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో సమాజానికి చాలా ముప్పువాటిల్లుతుందని, భూమిలో ప్లాస్టిక్ కరుగదని, దీన్ని పశువులు తినడం వలన విషపదార్థంగా తయారై వాటి ప్రాణాలకు ముప్పువాటిల్లుతుందని తెలిపారు. జీవమిత్ర ఆర్గనైజేషన్ నిర్వాహకులు భరత్‌కుమార్, ఉత్తమ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బదులుగా హానీచేయని, భూమిలో కరిగే కవర్లను తయారు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. వీటి ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ రహిత కవర్లను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో బక్కారెడ్డి, పాంబండ దేవాలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సోసైటీ డైరెక్టర్ కొండయ్యగౌడ్, వ్యాపారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



పరిగి, ఫిబ్రవరి 6 : పరిగి మండల పరిధిలోని మిట్టకోడూర్ గ్రామంలో పోచమ్మ దేవత, నాగుల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం కొనసాగుతుంది. ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం 7వ తేదీ శుక్రవారం వరకు కొనసాగనుంది. గురువారం అమ్మవారి ఊరేగింపు, కోలాటం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు హోమము నిర్వహించారు. ఈ విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలలో మాజీ సర్పంచ్‌లు పటేల్ జగదీశ్వర్, జయలక్ష్మీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ■ సీసీ రోడ్డు పనులు ప్రారంభం



తాండూరు రూరల్, ఫిబ్రవరి 6: తాండూరు మండలం, చెన్‌గేష్‌పూర్‌లో రూ.ఐదు లక్షల వ్యయంతో ఉపాధి హామీ పథకంలో భాగంగా సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. గ్రామానికి రూ.పది లక్షలు మంజూరు కాగా, ఇప్పటికే అనుబంధ గ్రామమైన కొనాపూర్‌లో రూ.ఐదు లక్షల సీసీ రోడ్డు పనులు పూర్తయినట్లు శ్రీశైలంగౌడ్, రాజుగౌడ్, వెంకట్‌రెడ్డి తెలిపారు.

## ఎర్రమట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు స్వాధీనం

నవాబుపేట, ఫిబ్రవరి 6: ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్లను నవాబుపేట పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అరుణ్ కుమార్ కథనం ప్రకారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా నర్సింగ్ నుంచి నవాబుపేట వైపు వస్తున్న రెండు టిప్పర్ల డ్రైవర్లను అనుమతి పత్రాలు చూపాలని కోరగా లేవని వారు సమాధానం తెలిపారు. రెండు ఎర్రమట్టి లోడ్ టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా ఎర్రమిట్టి తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

# ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 6: జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో రెండు పడక గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇప్పటి వరకు జిల్లాలో 851 ఇండ్లు పూర్తి అయ్యాయని మిగతా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తే పేదలకు అందుబాటులోకి వస్తాయని నివాసయోగ్యంగా ఉండేందుకు అవసరమైన వాటర్ సప్లై, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, ప్రాజెక్ట్ డైరెక్టర్ హౌసింగ్ కృష్ణయ్య, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రవణ్ ప్రకాష్ ఉన్నారు.

# చదువుతో పాటు సామాజిక బాధ్యత



మోటివేషన్ క్లాసును వింటున్న విద్యార్థులు

దోమ, ఫిబ్రవరి 6 : విద్యార్థులకు చదువుతో పాటుగా సామాజిక బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవం కలిగేలా ఫ్యాకల్టీ ట్రైనర్ సేవక్ కుమార్ సామాజిక కార్యకర్త పెంటన్న విద్యార్థులకు మోటివేషన్ క్లాస్‌ను నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో వెంకట్, దోమ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్‌జీ గార్డెన్‌లో గురువారం నిర్వహించిన మోటివేషన్ క్లాస్‌కు మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి సుమారు వేయి మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫ్యాకల్టీ ట్రైనర్ సేవక్ కుమార్ ఇచ్చిన మోటివేషన్ క్లాస్‌ను విన్నారు. ట్రైనర్ తనకున్న అనేక స్కిల్స్ ద్వారా విద్యార్థులకు షార్ట్ టైమ్, మిడ్ టైమ్, లాంగ్ టర్మ్ గోల్స్‌లతో పాటుగా సక్సెస్ ఎలా సాధించాలో వివరించారు.



మర్పల్లి, ఫిబ్రవరి 6: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను మర్పల్లి మండల నాయకులు గురువారం కలిశారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చి ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ యాదయ్య, గ్రామస్తులు అనిల్, యాదయ్య పాల్గొన్నారు.



ధారూరు,ఫిబ్రవరి 6: ఆధార్ సేవా కేంద్రాల్లో ఏదైన నిర్లక్ష్యం జరిగితే ఆధార్ కేంద్రాన్ని సీజ్ చేస్తామని ధారూరు తహసీల్దార్ షాజిదాబేగం ఆధార్ కేంద్ర నిర్వాహకులను హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో మూడు, నాలుగు నెలలుగా మూతపడిన ఆధార్ కేంద్రంలో గల సాంకేతిక సమస్యలు ఈడిఎం గారి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, తదితరులు ఉన్నారు.

## వర్గీకరణలో మాలలకు తీవ్ర అన్యాయం



పరిగి, ఫిబ్రవరి 6 : ఎస్సీ వర్గీకరణలో రాష్ట్ర ప్రభుత్వం మాలలకు తీరని అన్యాయం చేసిందని మాలమహానాడు వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సుల్తాన్‌పూర్ వెంకటయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సపోర్ట్ చేసిన మాలలను కాదని వెన్నుపోటు పొడిచారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన బెట్టి బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ చేసి మాలలను దోషులుగా చేస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా అలానే చేస్తే పది సంవత్సరాలు రాజకీయ సమాధి కట్టామన్నారు. రేవంత్ రెడ్డి కూడా చంద్రబాబు శిష్యుడేనని ఆయనకు కూడా అదే గతి పట్టిస్తామన్నారు. స్థానిక ఎన్ని కల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడగొట్టి రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెబుతామన్నారు.ఈ రోజు నుండి మాలల నినాదం కాంగ్రెస్ అంతం మాలల పంతం గా పనిచేస్తామన్నారు.

## నేటి నుంచి ఉర్సు..

పూడూరు, ఫిబ్రవరి 6: పూడూరు మండలం నిజాంపేట్ మేడిపల్లిలోని మహబూబ్ సుభాని ఖాజాబందనవాజ్ దర్గ ఉరుసు ఉత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ పెంటమ్మ, నిర్వాహకులు సీహెచ్. నర్సింహా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నేడు సాయంత్రం 7 గంటలకు గంధం ఎక్కించడం, 8వ తేదీన దీపం వెలిగించుట, 9వ తేదిన ఖవాలి, కందుర్గు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ఉత్సవాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు పొందాలని వారు కోరారు.

# చేసిన అప్పులు తీర్చేందుకు చైన్‌స్నాచింగ్

### హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి అరెస్ట్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 6: జల్సాలు, బెట్టింగ్‌లకు బానిసగా మారిన ఓ యువకుడు .. చేసిన అప్పులను తీర్చేందుకు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడి పోలీసులకు చిక్కాడు. ఈ సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన ఉప్పులేటి శశికుమార్ (21) ప్రస్తుతం ఎల్బీనగర్, మన్సూరాబాద్, సూర్యోదయనగర్ కాలనీలో నివాసముంటూ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. ఖాళీ సమయాల్లో ఫుడ్‌డెలివరీ చేస్తున్నాడు. మద్యం తాగడం, జల్సాలు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడుతూ అప్పుల్లో కూరుకుపోయాడు. దీంతో చేసిన అప్పులను తీర్చడానికి .. ఒంటరిగా తిరుగుతున్న మహిళల మెడలోని బంగారు ఆభరణాలను దోచుకోవాలని పథకం వేసుకున్నాడు. పథకంలో భాగంగా ఈ నెల 3న సాయంత్రం 4:40 గంటల సమయంలో చంద్రపురికాలనీలో బుర్రి రుక్మిణమ్మ అనే వృద్ధురాలు తన కాంపౌండ్ వాల్‌లో వాకింగ్ చేస్తుండగా వెనకనుంచి వెళ్లిన శశికుమార్ ఆమె మెడలోని 15 గ్రాముల బంగారు గొలుసును అపహరించుకుని పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ కెమెరాలో లభించిన ఆధారాలతో అన్వేసిస్తుండగా బుధవారం సూర్యోదయకాలనీలో శశికుమార్ తారాసపడ్డాడు. అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దొంగతనం విషయం బయటపడింది. నిందితుడి నుంచి 15 గ్రాముల బంగారు గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ తప్పించుకునే యత్నం..

### వాహనాలను ఢీకొని డివైడర్‌పైకి ఎక్కిన కారు

### ఐదుగురు విద్యార్థులు అరెస్ట్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరుగుతున్న విషయాన్ని గమనించిన ఓ మందుబాబు కారును వెనక్కి తిప్పే క్రమంలో రోడ్డు మీద ఆగిన కార్లను ఢీకొట్టడంతో పాటు డివైడర్‌ను ఎక్కించాడు. ఈ ఘటనలో మద్యం తాగిన ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాచుపల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్న పాల్మాకుల మృదుల్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఇంజినీరింగ్ స్నేహితులు రితుల్‌కుమార్‌రెడ్డి, అజయ్ మంతెన, మెన్నేని అజయ్‌రావ్, జక్కుల విసాస్‌లతో కలిసి బుధవారం రాత్రి మాదాపూర్‌లోని ఓ పబ్‌లో మద్యం సేవించారు. రాత్రి 11.45 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ రోడ్ నం.10మీదుగా కారులో ఇంటికి బయలుదేరారు. నవయుగ సమీపంలోకి రాగానే రోడ్డుపై జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్స్ చేస్తున్నారు. గమనించిన మృదుల్ ట్రాఫిక్ పోలీసులను తప్పించుకునే క్రమంలో వేగంగా వెళ్తూ కుడివైపు డివైడర్ మీదుగా యూటర్న్ తీసుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో రోడ్డు మీద ఆగిన కారు(టీఎస్ 07ఈసీ 1717)ను వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో కారు కుడివైపున నుజ్జునుజ్జయింది. అంతటితో ఆగకుండా కుడివైపు ఉన్న డివైడర్ మీదకు ఎక్కించి పారిపోయేందుకు యత్నించారు. అయితే కుడివైపు రోడ్డు తక్కువ ఎత్తులో ఉండడంతో కారు కిందకు పల్టీ కొట్టింది. కారు నడిపిస్తున్న మృదుల్ చేయి విరగడంతో పాటు ఇతర యువకులకు స్వల్పంగా గాయాలయ్యాయి. అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు కారులో ఉన్న వారిని బయటకు తీసి జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. గాయపడిన మృదుల్‌తోపాటు కారులోని నలుగురు వ్యక్తులకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయగా వారంతా మద్యం తాగినట్లు తేలింది. ఈ మేరకు మృదుల్‌తో పాటు ఇతర యువకులపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

## ఐఫోన్ అమ్ముతానంటూ బురిడీ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6: ఓఎల్ఎక్స్‌లో ఐ ఫోన్ అమ్ముతామంటూ వ్యక్తిని బురిడీ కొట్టించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.2లో నివాసం ఉంటున్న వ్యాపారి శంకర్ అగర్వాల్ ఇటీవల ఐఫోన్ కొనేందుకు ఓఎల్ఎక్స్‌లో సెర్చ్ చేస్తుండగా కిరణ్ అనే వ్యక్తి తనవద్ద ఐ ఫోన్ 16 ప్రో మాక్స్ ఉందని చెప్పాడు. దాన్ని అర్జెంట్‌గా అమ్మాల్సిన అవసరం ఉందని నమ్మించాడు. తన సోదరుడు వచ్చి ఫోన్ చూపిస్తాడని, చూసిన తర్వాత డబ్బులు ఇవ్వాలని చెప్పాడు. దీంతో బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని జింఖానా క్లబ్ వద్దకు వచ్చిన శంకర అగర్వాల్‌ను ఓ యువకుడు కలిశాడు. తన అన్న ఐ ఫోన్ పంపించాడని చూపించాడు. ఫోన్ నచ్చడంతో రూ.75వేలు అతడు సూచించిన నంబర్‌కు పంపించాడు. ఫోన్‌లో తన సోదరుడితో కన్ఫర్మ్ చేసుకుంటానంటూ మాటల్లో పెట్టిన గుర్తుతెలియని వ్యక్తి అక్కడినుంచి ఉడాయించాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన శంకర అగర్వాల్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## దాడిచేసిన జిమ్ ట్రైనర్ అరెస్ట్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6: తనను ప్రేమిస్తూ.. వేరే యువతితో తిరుగుతున్నావంటూ నిలదీసిన ప్రియురాలిపై దాడి చేసిన జిమ్ ట్రైనర్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఏపీ, విశాఖపట్నం జిల్లాకు చెందిన కుమర్ల ప్రసాద్ (27) జూబ్లీహిల్స్ రోడ్ నం.10లోని వెంకటగిరిలో నివాసం ఉంటున్నాడు. హైలమ్ కాలనీలోని ఓ జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌కు మూడేళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న యువతి(24)తో ప్రేమాయణం ఉంది. ఇటీవల తరచూ మద్యం సేవించడంతోపాటు వేరే యువతితో పరిచయం పెంచుకున్న ప్రసాద్.. ప్రియురాలిని వేధిస్తున్నాడు. వేరే యువతితో తిరుగుతున్న విషయం గురించి మాట్లాడేందుకు రెండ్రోజుల క్రితం జూబ్లీహిల్స్ రోడ్ నం.10(సి)లోని పబ్ సమీపంలోకి వచ్చిన యువతితో మాటామాటా పెరగడంతో ప్రసాద్ ఆమెపై దాడి చేశాడు.



శివారెడ్డిపల్లిలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో వెంకట్

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

దోమ, ఫిబ్రవరి 6: విద్యార్థుల పూర్తి వివరాలను అపార్ ఐడీలో జనరేట్ చేయాలని దోమ మండల విద్యాధికారి వెంకట్ అన్నారు. మండల పరిధిలోని శివారెడ్డిపల్లి, గూడూరు, దొంగ ఎన్కెపల్లి, రత్నానాయక్ తండా తదితర పాఠశాలలతో పాటుగా అంగన్‌వాడీ సెంటర్లను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపార్ ఐడీ జనరేట్, జీజీ, ఈపీ, ఎఫ్‌పీ ఎఫ్ఎ-1, ఎఫ్ఎ -2, ఎస్ఎ-1 తదితర అంశాలను వంద శాతం పూర్తి చేసే దిశగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.అనంతరం ఆయన శివారెడ్డిపల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలోకి ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు తీసుకువెళ్లరాదని హెచ్చరించారు. బడిబయటి పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

వికారాబాద్, ఫిబ్రవరి 6: ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు తెలిపారు. సోమవారం ధాన్యం సేకరణ కార్యచరణ ప్రణాళిక, సీఎంఆర్ డెలివరీ, రేషన్ కార్డులు, మిల్లర్ల అసోసియేషన్ల బ్యాంక్ గ్యారంటీ పత్రాల సమర్పణ తదితర అంశాలపై పౌరసరఫరాల ముఖ్య కార్యదర్శి డి.ఎస్. చౌహన్ ఉన్నతాధికారులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, జిల్లా మేనేజర్లు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ 2024-25 రబీ సీజన్‌లో 2,25000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా ఉందని లక్ష టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కులకచర్ల, ఫిబ్రవరి 6 : మండల పరిధిలోని సాల్వీడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని దీప్ల నాయక్ తండాలో మూడావత్ రవి అనారోగ్యంతో మృతి చెందడంతో అదే గ్రామానికి చెందిన సాల్వీడ్ విఠల్ ఖర్చుల నిమిత్తం రూ. ఐదువేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో తండా వాసులు బాలునాయక్, శంకర్, నార్య, రాజు, సంతు, హన్మంతు పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధర కల్పించడమే మార్కెట్ కమిటీ లక్ష్యం



ధారూరు, ఫిబ్రవరి 6: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా మార్కెట్ కమిటీ కృషి చేస్తున్నదని మార్కెట్ కమిటీ కార్యదర్శి మహమ్మద్ ఫసీయుద్దీన్, గ్రీన్ మార్కెట్ కమిటీ అసోసియేషన్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం వికారాబాద్ జిల్లా కేంద్రంలో గల మార్కెట్ కమిటీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులను అరికట్టడమే లక్ష్యంగా మార్కెట్ కమిటీని వారంలో ఐదు రోజులపాటు క్రయ విక్రయాలు జరుపనున్నామని స్పష్టం చేశారు. ఆదివారం, మంగళవారం మార్కెట్ కమిటీకి సెలవుగా ప్రకటించినది. మిగిలిన ఐదు రోజుల్లో రైతులు పంట దిగుబడులను ఉదయం 11గంటల లోపు తీసుకోని రావాలని సూచించారు. కార్యక్రమంలో కొల్లేటి సాయి, మార్కెట్ డైరెక్టర్ రవి, తదితరులు ఉన్నారు.

## ■ కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



పెద్దేముల్, ఫిబ్రవరి 6 : మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. మొత్తం 320 మంది వైద్య శిబిరానికి హాజరు కాగా వారిని పరిశీలించిన వైద్యులు 55 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని నిర్ధారించారు. ఈ 55 మందికి ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌కు తరలించి , కంటి ఆపరేషన్‌లు చేయించి తిరిగి వారి స్వస్థలాలకు చేరుస్తామని ఎల్ఎన్ఆర్ యువసేన సభ్యులు తెలిపారు. ఈ శిబిరంలో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.